

# తెలుగోడి బుద్ధి

పుల్లమాంబకు పుస్తకాల పిచ్చి.

కథ చదువుతూ వంట చేస్తుంది. నవల నంజు కుంటూ భోజనం చేస్తుంది. కవితలు రుబ్బుతూ అంట్లు తోముకుంటుంది.

ఆమె హేండ్ బాగ్‌లో హేర్ పిన్నులు, రబ్బర్ బాండ్‌లు, అద్దం, పౌడరు పొట్లాం, సిటీ బస్సు టిక్కెట్లు, వక్కపొడి ప్యాకెట్ను, చిల్లర నాణేలతో బాటు నవలగాని, పత్రిక గాని వుంటుంది.

నెలకి పది రూపాయిలు పడేస్తే చాలు - రోజుకో పత్రిక యింట్లో పడేసి పోతాడు లెండింగ్ లైబ్రరీ వాడు.

అవి చాలక ఆమె తెలుగు విజ్ఞాన సమాచార కేంద్రం (లైబ్రరీ)లో సభ్యత్వం తీసుకుంది. వీలు చిక్కినప్పుడల్లా కేంద్రానికి వెళ్ళి నవల్స్ తెచ్చు కుంటుంది.

తెలుగోడి బుద్ధి అదో తరహా.

తన అద్దాన్ని ముద్దుగా దాచుకుంటాడు. మట్టాల అద్దాలకు మరకలు చేసిపెడతాడు. తన పుస్తకాన్ని, పత్రికల్ని బుద్ధిగా బీరువాలో దాచుకుంటాడు. పక్కింటి పత్రిక ముఖచిత్రాలకు మీసాలు పెడ తాడు. లేదా కూపన్లు గట్రా చింపి తీసుకుంటాడు.

ఈ తెలుగు బుద్ధికి దారుణంగా బలైపోతూ వుంటాయి లైబ్రరీ పుస్తకాలు.

ఆ పుస్తకాల్ని బైండింగ్ అయితే చేయిస్తారు కాని, వాటిలో మొదటివి పది, చివరివి ఐదూ కాగితా లుండవు! తలా, తోకా లేని వింత పిట్టల్లాగ వుంటాయా పుస్తకాలు!

పుల్లమాంబ మహాశ్రద్ధగా అన్ని పేజీలూ పూర్తిగా వున్న నవలను వెదికి వెదికి తెచ్చుకుంటుంది. తీరా ఒక్కొక్క పేజీ చదువుతోంటే — పేజీ పేజీకి అండర్ లైన్లు, కామెంట్‌లూ, పిచ్చి రాతలూ, పిచ్చి పిచ్చి బొమ్మలూ!

"చెత్త నవల" అని ఒకడు రాస్తే —

"నమ్మ వెధవా! ఇది చెత్త నవల కాదురా! చెత్తాతి చెత్త నవల" అని మరోడి కామెంట్!

వాళ్ళిద్దర్నీ తిడుతూ మూడోవాడు అలా ఒక వరస సాగిపోతే—

"అమృతాంజనం ముందుంచుకొని ఈ నవల చదవండి."

"అమృతాంజనం రాయడానికి ఒక అమ్మాయిని కూడా వుంచుకోండి" — ఇలా మరో వరస!

ఈ కామెంట్స్ ఒక్క తెలుగులోనే కాదు, ఇంగ్లీషు తిన్నగా రాయడం చేతకాని దద్దమ్మలు కూడా తమ బోడి అభిప్రాయాలను బొళబొళా బరితెగించి రాసెయ్యడమే!

ఉమ్మడి సొత్తుని యిలా ధ్వంసం చేసే జాతి జీవుల సంస్కారం నట్టుబండలు గురించి భర్త పుల్లా నాథ్ బుర్ర మీద వాయించి మరీ చీల్చి చెండాడి ఎండబెడుతూ వుంటుంది పుల్లమాంబ.

పుల్లానాథ్ — స్టూడెంట్‌గా వున్నప్పుడు — తనూ లైబ్రరీ పుస్తకాల మీద అలాంటి రాతలు రాసినవాడే! అలాంటి రాతలు చదువుకొని నవ్వు కున్నవాడే! ఇప్పుడేమో అలాంటి రాతల వల్ల స్వంత కొంప మునిగిపోయినట్టు భార్య లబోదిబో మంటోంటే — గుంభనగా నవ్వుకొని - పైకి మాత్రం వెర్రిమొగం పెట్టి "పోనిస్తూ! లోకంలో తియ్యనివీ వుంటాయి, పుల్లనివీ వుంటాయి. మనం పట్టించుకోకూడదు" అని సర్దిచెబుతూ వుంటాడు.

ఓ రోజు పుల్లానాథ్ చల్లారిన కాఫీ "తాగాలా, వద్దా; తాగితే నష్టం ఏమిటి? తాగకుండా భార్యామణిని పిలిచి కాఫీ వేడి చెయ్యమని చెబితే లాభం వుం టుందా?" అని వాలుకుర్చీలో దీర్ఘంగా ఆలోచిస్తున్న తరుణంలో —

ఒక నవల రాకెట్‌లాగా దూసుకొచ్చి అతని ఒడిలో పడింది. ఆ వెనకనే జడివానలాగా రొప్పుతూ వచ్చిన పుల్లమాంబ రోజుతూ అంది "మాశారా మాశారా ఈ రాతలు! ఈ సన్నాసుల సంస్కారం! ఈ చవటల ఛేత్కారీతనం!!"

చల్లారిపోయిన కాఫీ కప్పు కిందపెట్టేసి నవల తిరగేశాడు పుల్లానాథ్.

దానికి కవర్ పేజీ లేదు. రచయిత పేరూ లేదు. నవల పేరు మాత్రం ప్రతి పేజీ మీదా వుంది. ఆ పేరు ఎక్కడో, ఎప్పుడో విన్నట్టుగానే వుంది.

మధ్య పేజీల్లో పాఠకుల అమూల్య అభిప్రాయాలు రాసి వున్నాయి.

చెత్త, బోర్, సుత్తి లాంటి మాటలు కావవి! నవతరం పాఠకులు మరొక అడుగు ముందుకేశారు.

ఈ నవల రాసినవాడి భార్యను ఏదో చేస్తానని ఒకడి స్టేట్‌మెంట్!

చదివినవాడి తల్లిని, చెల్లినీ మరేదో చేస్తానని యింకొకడి స్టేట్‌మెంట్!

"ఫర్వాలేదు. ప్రజలు ముందుకెళ్తున్నారు!" అని నవ్వుకొని నవల చదవడం ప్రారంభించాడు పుల్లానాథ్.

మొదటి పేజీ చదివేసరికి అతని ముఖం గంభీరంగా మారిపోయింది.

అతనికి హఠాత్తుగా జ్ఞాపకం వచ్చింది ... రచయిత ఎవరో!

అది యిరవై ఏళ్ళ క్రితం తను రాసిన మొదటి నవల! ●

చంద్ర




కోకిల కంఠంలో గీతిక వల
కొబ్బరి మట్టల మధ్య వెన్నెల
రాళ్ళ మధ్య కోనేల
సుఖ దుఃఖాల కావల
మనిషి కేవలం కల-

- గుంటూరు సాత్యకి శర్మ